సాక్షి
సూర్యాపేట
గురువారం । 16 । ఫిబ్రవరి । 2023



పోలీస్ అభ్యర్థుల ఈవెంట్స్ షురూ
నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో పోలీస్ అభ్యర్థులకు బుధవారం దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. - 8లో



యాదాద్రిలో శివరాత్రి ఉత్సవాలు
యాదాద్రి శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం
35°/16°

వాతావరణం
ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అన్ని హంగులతో పాఠశాలల అభివృద్ధి



పరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈఓ సురేష్

గరిడేపల్లి: ప్రభుత్వ పాఠశాలలు అన్ని హంగులతో అభివృద్ధి చెందుతున్నట్లు జెడ్పీ సీఈఓ సురేష్ తెలిపారు. మండలంలోని పరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాల పరిసరాలతో పాటు అభివృద్ధి, వసతుల విషయాన్ని ప్రధానోపాధ్యాయుడు గుగులోతు సైదానాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేస్తున్న ప్రతి ఒక్క మెటీరియల్‌ను తప్పని సరిగా విద్యార్థులకు అందించాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం పెట్టాలన్నారు. ఆయన వెంట ఎంపీపీ పెండెం సుజాతశ్రీనివాస్ గౌడ్, ఎంపీడీఓ వనజ, స్థానిక సర్పంచ్ వీరంరెడ్డి లక్ష్మీశంభిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శంభిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్ నవీన్, అంగన్‌వాడీ టీచరు సురభి సునిత, ఆయా లక్ష్మమ్మలతో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

అర్వపల్లి : అర్వపల్లితో పాటు మండల వ్యాప్తంగా బుధవారం సూర్యాపేట డివిజన్ పరిధిలోని విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఇంటింటికీ తిరిగి తనిఖీలు నిర్వహించారు. సూర్యాపేట డిస్కం డీఈఈ శ్రీనివాసులు, నాగారం ఏడీఈ అరుణ్‌కాంత్, స్థానిక ఏఈఈ వి.శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో 12 బృందాలు తనిఖీలు చేశాయి. ఇందులో 500 సర్వీసులను పరిశీలించి విద్యుత్ చోరీకి పాల్పడుతున్న 52 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సబ్ ఇంజనీర్ గిరిబాబు, డివిజన్ పరిధిలోని ఏడీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుపురుగుల పెంపకంతో అధిక ఆదాయం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌గౌడ్

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : మల్బరీ తోటలను సాగు చేసి పట్టుపురుగుల పెంపకంతో ఎక్కువ ఆదాయం పొందే అవకాశం ఉందని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి బెల్లంకొండ శ్రీధర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని నంద్యాలగూడెంలో ప్రాంతీయ పట్టు ఉత్పాదన పరిశోధనా కేంద్రం, జిల్లా పట్టుపరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మల్బరీ తోటల సాగుతో రైతులు నెలవారీ ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పట్టు పరిశ్రమ అధికారి ఎస్. వీరకుమార్ , పట్టు పరిశ్రమ శాస్త్రవేత్త డాక్టర్ వినోద్ కుమార్ యాదవ్ , శాస్త్రవేత్తలు పటేల్ శ్రీనివాస్ రెడ్డి , కేవీకే శాస్త్ర వేత్త మాధురి ,టెక్నికల్ అధికారి రూయమణి ,టెక్నికల్ అసిస్టెంట్ పుల్యా పాల్గొన్నారు.

కనులపండువగా అర్వపల్లిలో పారువేట



పారువేటను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, పాలకవర్గం

అర్వపల్లి: అర్వపల్లిలోని శ్రీ యోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పారువేట కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం కనుల పండువగా నిర్వహించారు. దీనిని జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, ఆలయ చైర్మన్ విద్యాసాగర్, సర్పంచ్ బైరబోయిన సునితారామలింగయ్య, ఎంపీటీసీ పద్మశ్రీనివాస్, ఈఓ శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాపా వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ పులిచెర్ల ప్రభాకర్, కడారి నరేష్, పులిచెర్ల ప్రభు, కోటమర్తి మల్లయ్య, ఎంఈఓ బాలునాయక్, హెచ్‌ఎం ప్రసాద్, ఎస్‌ఓలు నాగరాణి, శిరీన్, జేఏ పన్నాల శ్రీనివాసరెడ్డి, అర్చకులు విఖనసాచార్యులు, రాంబాబు, ఆనంద్, పవన్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఆక్రమణలు

కోదాడ పెద్ద చెరువు కబ్జాకు మళ్లీ యత్నం

- నాలుగు చోట్ల మట్టిపోసి చదును చేస్తున్న అక్రమార్కులు
- హెచ్చరిక బోర్డు సైతం తొలగింపు
- పట్టించుకోని అధికారులు



కోదాడ పెద్ద చెరువులో మట్టిపోసి పూడ్చిన ప్రాంతం

కోదాడ: పెద్ద చెరువు ఆక్రమణకు అక్రమార్కులు మళ్లీ తెరలేపారు. వేసవి వస్తుండడంతో చెరువు నీటి మట్టం తగ్గుతుండడంతో మట్టితో పూడ్చి క్రమంగా లోతట్టులోకి చొచ్చుకొని పోతున్నారు. గతంలో ఆక్రమణలు జరిగిన ప్రదేశంలో పట్టణ వాసుల ఫిర్యాదు మేరకు × చెరువును ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని౯ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును కూడా అక్రమార్కులు తొలగించి కబ్జా చేస్తున్నా ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇరిగేషన్ అధికారులు ఉన్నా..

కోదాడ పెద్ద చెరువు దాదాపు 720 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. మూడు వైపుల ఆక్రమణలు జరగడంతో ప్రస్తుతం 400 ఎకరాలకు కుచించుకుపోయింది. ప్రతి వేసవిలో మునక పట్టాల పేరుతో కబ్జాల పర్వ కొనసాగుతూనే ఉంది. సూర్యాపేట జిల్లా ఏర్పడిన తరువాత కోదాడ పట్టణంలో ఇరిగేషన్ శాఖ ఎస్‌ఈ, ఈఈ, డీఈఈ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ఇంత మంది ఇరిగేషన్ అధికారులు ఉన్నా తమ కార్యాలయాలు ఉన్న కోదాడ పట్టణంలోని చెరువు ఆక్రమణలను ఆపలేక పోవడంపై విమర్శలువెల్లువెత్తుతున్నాయి. గతంలో మిషన్ కాకతీయ పనులు జరిగినపుడు హద్దుల నిర్ణయించి పెగ్ మార్కులు ఏర్పాటు చేయాల్సి ఉండగా అధికారులు ఆ పని చేయించలేదు. దీంతో కబ్జాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి.

రెండు వారాలుగా..

కొందరు అక్రమార్కులు చెరువు ఆక్రమణకు మళ్లీ ప్రయత్నం చేస్తున్నారు. ఇళ్లు కూల్చివేసిన వ్యర్థాలను రాత్రివేళలో తెచ్చి చెరువులో పోసి చదును చేస్తున్నారు. తాజాగా చెరువులో నాలుగు చోట్ల ఇలాపోస్తున్నారు. రెండు వారాలుగా ఈ తంతు జరుగుతోంది.

మూడు వైపుల నుంచి..

కోదాడ పెద్దచెరువు పట్టణానికి ఆనుకొని ఉంది. దీంతో ఇక్కడి భూమి విలువ ఎక్కువగా ఉండడంతో ఆక్రమణ దారులకు ఇది వరంగా మారింది. పట్టణంలో ఇళ్లు కూల్చినప్పుడు ఏర్పడే వ్యర్థాలను రాత్రికి రాత్రే చెరువులో పోసి చదును చేస్తారు. ఇలా క్రమంగా పోస్తూ చెరువు లోతట్టును ప్లాట్‌గా చేసి ఆక్రమణలకు పాల్పడుతున్నారు. మున్సిపాలిటీకి చెందిన కొందరు రాత్రి సమయాల్లో డంపింగ్ యార్డులో పోయకుండా చెరువులో పోస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కోదాడ పట్టణంలోని సూర్యాపేట రోడ్డులో, రామిరెడ్డిపాలెం వైపు, వెంకట్రాంపురం వైపు కబ్జాల జోరు ఎక్కువగా ఉంది.

కబ్జా జరగకుండా చూడాలి



జల వనరుల రక్షణకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు వేరే విధంగా ఉన్నాయి. ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు. కబ్జాలకు పాల్పడుతున్న వారిలో అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు ఉండడం బాధాకరం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చెరువు ఆక్రమణలు జరగకుండా పటిష్ట మైన చర్యలు తీసుకోవాలి.

– జలగం సుధీర్, ఎన్‌ఆర్‌ఐ, కోదాడ

చెరువు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం

కోదాడ పెద్దచెరువు ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. గతంలో ఏర్పాటు చేసిన బోర్డును కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తీసుకు పోయారు. మళ్లీ దానిని ఏర్పాటు చేస్తాం.

– సువర్ణరేఖ, డీఈఈ, జలవనరులశాఖ, కోదాడ

వందశాతం పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న సీడీఎంఏ సత్యనారాయణ, చిత్రంలో కలెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్లు

- మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి
- సీడీఎంఏ సత్యనారాయణ ఆదేశం
- కలెక్టరేట్‌లో అధికారులతో ప్రత్యేక సమావేశం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో వందశాతం పన్నులు వసూలు చేయాలని సీడీఎంఏ(కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) యన్. సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్. వెంకట్రావుతో కలిసి జిల్లాలోని ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో పన్నులకు సంబంధించి ఇచ్చిన టార్గెట్‌ను ఈ మాసాంతానికి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య పనుల పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సూర్యాపేట పట్టణంలోని వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం చివరి దశకు చేరుకుందని, మిగిలిన పనులు త్వరలో పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. అదే విధంగా కోదాడ, హుజూర్‌నగర్ పట్టణాల్లో మార్కెట్ నిర్మాణ పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని కోరారు. డంపింగ్ యార్డుల్లో బయోమైనింగ్ జరగాలని ఇప్పటికే సూర్యాపేట, నేరేడుచర్ల మున్సిపాలిటీల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోందని మిగతా వాటిల్లో కూడా త్వరలో చేపట్టాలని ఆయన సూచించారు. తడి పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని , అన్ని మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. వైకుంఠధామాల్లో చేపట్టాల్సిన పనులు, మరమ్మతులు, నర్సరీల నిర్వహణ, ఆస్తి పన్ను వసూళ్ల పై ఆయా మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. సూర్యాపేట, నల్లగొండ జిల్లాలకు సంబంధించి జీఓ నంబర్ 58, 59 కింద అందిన ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తులను క్షుణంగా పరిశీలించాలని, భూముల అసైన్‌మెంట్, క్రమబద్ధీకరణ, హక్కుల బదలాయింపును పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత్ కేశవ్, ఎస్. మోహన్‌రావు, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, వెంకారెడ్డి, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్లు రామనుజులరెడ్డి, డి. మహేశ్వర రెడ్డి, శ్రీనివాసరెడ్డి, డి. శ్రీనివాస్, బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహాప్రస్థానం పనులు త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ వెంకట్రావు



జిల్లా కేంద్రంలో మహాప్రస్థానం పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

సూర్యాపేట: జిల్లా కేంద్రంలోని హిందూ శ్మశాన వాటికను మహాప్రస్థానంగా పునరుద్ధరించే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకట్రావు అధికారులను, సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సూర్యాపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రూ. 3. 59కోట్లతో చేపట్టిన మహాప్రస్థానం నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ పి. రామానుజులరెడ్డిని పనుల వివరాలను అడిగితెలుసుకున్నారు. మహాప్రస్థానం మొత్తం కలియ దిరిగి పనులను పరిశీలించారు. నాణ్యతలో రాజీ లేకుండా నిర్మాణ పనులు చేపట్టాలని, మార్చి నెలాఖరు వరకు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, ఈఈజీకేడీ ప్రసాద్, ఏఈ సుమంత్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- ఎస్పీ రాజేంద్రప్రసాద్



మాట్లాడుతున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట క్రైం: రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరమని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. కేసుల నమోదు, పెండింగ్ కేసుల వివరాలు, కోర్టు కేసుల స్థితిగతులు, పోలీసింగ్ నిర్వహణ, కమ్యూనిటీ పోలీసింగ్, పోలీసు పని విభాగాల నిర్వహణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు అన్ని అనుమతి పత్రాలు కలిగి ఉండాలన్నారు. లైసెన్స్, ఇన్సూరెన్స్, బండికి నంబర్ ప్లేట్ కలిగి ఉండాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని కోరారు. పోలీసులు.. ప్రజలతో మమేకంకావాలని, అధికారులు పరస్పరం సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వర్ రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ రవి, ఏఓ సురేష్‌బాబు, శ్రీనివాస్, నర్సింహ, రాజేష్, ఆంజనేయులు, శివశంకర్, ప్రసాద్, నాగార్జున, రాజశేఖర్, గౌరినాయుడు, శ్రీనివాసరావు, శ్రీనివాస్, నర్సింహారావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పేద ప్రజల పెన్నిధి ధర్మభిక్షం



ధర్మభిక్షం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పేద ప్రజల పెన్నిధి దివంగత మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం అని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కొనియాడారు. బుధవారం జిల్లా కేంద్రంలో ధర్మభిక్షం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గీసేవాడికే చెట్టు, దున్నేవాడికే భూమి నినాదంతో ధర్మభిక్షం ఉద్యమాలు నిర్వహించారని, నేడు గీత కార్మికులకు సొసైటీలను ఏర్పాటు చేసిన ఘనత ఆయనదే అని అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా సూర్యాపేట ఎమ్మెల్యేగా, నల్లగొండ ఎంపీగా ప్రజా సేవ చేశారని గుర్తు చేశారు. బొమ్మగాని శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అనంతుల మల్లేశ్వరి, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు దంతాల రాంబాబు, సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిల్ నాయకులు దోరేపెల్లి శంకర్, ఖమ్మంపాటి అంతయ్య, చామల అశోక్, నిమ్మల ప్రభాకర్, గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు రేగటి లింగయ్య, సైదులు, తదితరులు పాల్గొనారు.

పంచ నారసింహుడికి ప్రత్యేక పూజలు

యాదగిరిగుట్ట: పంచ నారసింహ క్షేత్రంగా విరాజిల్లుతున్న యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయంలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువ జామునే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం నిర్వహించారు. అనంతరం స్వయంభూలకు బిందెతీర్థం, ఆరాధన గావించారు. శ్రీస్వామి వారికి బాలభోగం చేపట్టిన తరువాత మూలవర్యులకు నిజాభిషేకం నిర్వహించి, పట్టువస్త్రాలతో అలంకరించారు. శ్రీస్వామివారికి విశేషంగా సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు శ్రీస్వామి వారి దర్శనం భాగ్యం కల్పించారు. ఇక ఆలయంలో సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం, నిత్య కల్యాణం, తిరువీధి జోడు సేవలను నిర్వహించారు. రాత్రి పవళింపు సేవను నిర్వహించారు.

గిరిజన పంచాయతీలకు సొంత భవనాలు

- ఒక్కో భవన నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున కేటాయింపు
- 32 పంచాయతీలకు రూ.6.40 కోట్లు మంజూరు
- 10 గుంటల స్థలంలో అన్ని సౌకర్యాలతో నిర్మాణం



అద్దె భవనంలో కొనసాగుతున్న మొండిచింత తండా పంచాయతీ కార్యాలయం

తిరుమలగిరి (తుంగతుర్తి): గ్రామ పంచాయతీలుగా మారిన తండాల్లో పక్కా భవనాలు సమకూరనున్నాయి. పంచాయతీ భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాకు రూ.6.40కోట్లు విడుదల చేసింది. తండాలు, గూడేలను రాష్ట్ర ప్రభుత్వం 2018 సంవత్సరంలో గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. గిరిజనులు తమను తాము పాలించుకునే అవకాశం కల్పించింది. ఇలా జిల్లాలో 32 తండాలు నూతన పంచాయతీలుగా ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ప్రారంభంలో పంచాయతీలను గ్రామాల్లో ఉన్న అద్దె భవనాలు, పాఠశాల భవనాలు, అరకొర వసతులు ఉన్న కార్యాలయాల్లో కొనసాగించారు. ఇరుకు గదుల్లో సరైన వసతులు లేక పంచాయతీ సమావేశాలు నిర్వహించాలన్నా ఇబ్బందులు ఎదురయ్యేవి. పంచాయతీలకు సొంత భవనాలు నిర్మించాలని చాలా రోజుల నుంచి సర్పంచ్‌లు డిమాండ్ చేస్తున్నారు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం ఈ గ్రామ పంచాయతీలకు సొంత భవనాల కోసం నిధులు కేటాయించింది. ఒక్కో పంచాయతీకి రూ.20 లక్షల చొప్పున జిల్లాలో 32 గిరిజన గ్రామ పంచాయతీలకు రూ.6.40 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ మేరకు పంచాయతీ రాజ్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

మండలాల వారీగా నిధులు మంజూరైన గిరిజన పంచాయతీలు

మండలం	పంచాయతీల సంఖ్య	మండలం	పంచాయతీల సంఖ్య
తిరుమలగిరి	5	అనంతగిరి	2
చివ్వెంల	4	సూర్యాపేట	1
తుంగతుర్తి	4	జాజిరెడ్డిగూడెం	1
ఆత్మకూరు(ఎస్)	4	పాలకవీడు	1
మఠంపల్లి	3	నేరేడుచర్ల	1
మద్దిరాల	2	పెన్‌పహాడ్	1
నూతనకల్	2	మేళ్లచెరువు	1

స్థలాల పరిశీలన పూర్తి

ఒక్కో గ్రామ పంచాయతీ భవనాన్ని 10 గుంటల స్థలంలో సకల సౌకర్యాలతో నిర్మించనున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో స్థలాలను కూడా అధికారులు పరిశీలించారు.

నిధులు వచ్చాయి

తిరుమలగిరి మండలంలో కొత్తగా ఏర్పడిన ఐదు గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున నిధులు వచ్చాయి.

– ఉమేష్‌చారి, ఎంపీడీఓ, తిరుమలగిరి.

నిధుల మంజూరు చేయడం సంతోషంగా ఉంది



నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు సొంత భవనాల కోసం నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉంది. నాలుగు సంవత్సరాలుగా అద్దె భవనంలో గ్రామ పంచాయతీని నిర్వహిస్తున్నాం. సమావేశాలు ఏర్పాటు చేయడం, రికార్డులు భద్రపర్చడం ఇబ్బందిగా మారింది. నూతన భవనం ఏర్పడితే సమస్యలు అన్నీ తీరుతాయి.

– మోహన్‌బాబు, సర్పంచ్, మొండిచింత తండా

వైకుంఠధామం.. వసతులు కనం

- కొన్నింటిలో నీరు లేదు.. మరికొన్నింటిలో కరెంటు నిల్
- ఐదు శాఖల మధ్య సమన్వయలోపం
- వసతుల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం
- బిల్లుల మంజూరులోనూ జాప్యం



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పల్లె ప్రగతిలో భాగంగా గ్రామాల్లో వైకుంఠధామాల నిర్మాణాలు పూర్తయినా సౌకర్యాల కల్పనపై అధికారులు దృష్టిసారించలేదు. శ్మశానవాటిల్లో విద్యుత్, నీటి వసతులు కల్పించలేదు. జిల్లాలో 23 మండలాల పరిధిలో 475 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లో వైకుంఠధామాలు నిర్మించారు. ఒక్కో వైకుంఠధామానికి రూ.12.50 లక్షల చొప్పున మొత్తం రూ .59.37 కోట్లు వెచ్చించి నిర్మించారు.. వీటిలో కొన్నింటిని ఈజీఎస్ ఆధ్వర్యంలో, మరి కొన్ని పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పూర్తి చేశారు. నిర్మాణ పనులు పూర్తయి ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు విద్యుత్ , నీటి వసతిని ఏర్పాటు చేయ లేదు. అధికారుల మధ్య సమన్వయ లోపమే దీని కారణమనే ఆరోపణలున్నాయి. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మాణాలకు మిషన్ భగీరథ అధికారులు నీటి వసతి కల్పించాలి.విద్యుత్ శాఖ అధికారులు శ్మశాన వాటిక వరకు విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలి. పంచాయతీరాజ్ (డీపీఓ) శాఖ అధికారులు నిర్వహణను చూడాల్సి ఉంది. జిల్లా పరిషత్ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది.

ఏడాది గడుస్తున్నా..

ఐదుశాఖల మధ్య సమన్వయంలేక శ్మశాన వాటిల్లో వసతులు సమకూరడంలేదు. మిషన్ భగీరథ అధికారులు కొన్ని చోట్ల బోర్లు వేసి, పంపుసెట్లు బిగించినట్లు చెబుతున్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. మరికొన్ని వైకుంఠధామాలకు మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా నల్లా కనెక్షన్ ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నా, పంప్‌హౌజ్ నిర్మించలేదు. జిల్లాలో 50 శ్మశాన వాటికలకు నీటి వసతి కల్పించలేదు. ఇక పూర్తయినవాటిలో 49 వైకుంఠధామాలకు విద్యుత్ సౌకర్యం లేదు. మిగతా వాటికి విద్యుత్ వసతి ఉన్నట్లు కాగితాలపై చూపుతున్న క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. నిర్మాణాలు పూర్తయి ఏడాది గడుస్తున్నా చాలా చోట్ల కాంట్రాక్టర్లకు వాటికి సంబంధించిన బిల్లులు మంజూరు కాలేదు . మూడు నెలలుగా ట్రెజరీలో ఫ్రీజింగ్‌లో పెట్టినట్లు ప్రచారం.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం



సూర్యాపేటలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈఓ కృష్ణయ్య

సూర్యాపేటటౌన్ : జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. 52 కేంద్రాల్లో ఉదయం, సాయంత్రం వేళలో ప్రాక్టికల్స్ నిర్వహించారు. వొకేషనల్, జనరల్ విభాగంలో 3,139 మంది విద్యార్థులకు గాను 2,812 మంది విద్యార్థులు హాజరు కాగా 327 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు డీఐఈఓ కృష్ణయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని శ్రీమేధ, ప్రతిభ, శ్రీనిధి, ఎస్‌ఆర్, శ్రీలక్ష్మీవెంకటసాయి ఒకేషనల్ కళాశాలలను ఆయన తనిఖీ చేశారు.

సూర్యాపేట నుంచి శ్రీశైలంకు ప్రత్యేక బస్సులు



కోదాడ డీఎం శ్రీహర్ష

భానుపురి (సూర్యాపేట) : మహా శివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సూర్యాపేట డిపో నుంచి శ్రీశైలంకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సురేందర్ తెలిపారు. ఈమేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 18వ తేదీ ఉదయం 5గంటలకు, 9.30 గంటలకు సూర్యాపేట బస్ స్టాండ్ నుంచి ఈ బస్సులు బయలుదేరనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అదే విధంగా వివాహాది శుభకార్యాలు, విహారయాత్రలకు ఆర్టీసీ 10శాతం రాయితీతో ఆగస్టు నెల వరకు బుక్ చేసుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కోదాడ డిపో నుంచి మేళ్ల చెరువు జాతరకు..

కోదాడఅర్బన్ : కోదాడ డిపో నుంచి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ దేవులపల్లి శ్రీహర్ష తెలిపారు. బుధవారం కోదాడ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 18 నుంచి జరిగే మహాశివరాత్రి జాతరకు కోదాడ నుంచి మేళ్ల చెరువుకు, ముక్త్యాలకు, హుజూర్‌నగర్ నుంచి మేళ్లచెరువుకు ఈ బస్సులు నడుపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కోదాడ బస్టాండ్ నుంచి మేళ్లచెరువు మహాశివ రాత్రి జాతరకు 20 బస్సులను ప్రతి 10నిమిషాలకు ఒకటి చొప్పున నడుపుతామని మేనేజర్ చెప్పారు. హుజూర్‌నగర్ పాత బస్టాండ్ నుంచి మేళ్లచెరువుకు 10 బస్సులను ప్రతి 10 నిమిషాలకు ఒక ట్రిప్ చొప్పున వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కోదాడ పట్టణం నుంచి ముక్త్యాల వరకు కూడా ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రతి గంటకు ఒక బస్సు చొప్పున నడపనున్నట్లు ఆయన చెప్పారు.

క్లుప్తంగా

గీత కార్మికుడికి గాయాలు



చికిత్స పొందుతున్న గీత కార్మికుడు రవి

యాదగిరిగుట్ట రూరల్ : తాటిచెట్టు పైనుంచి జారిపడి గీతాకార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని వంగపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుండ్లపల్లి రవి రోజులాగే ఉదయం తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని భువనగిరి అస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

వ్యక్తిపై హత్య కేసు నమోదు

ఆత్మకూరు (ఎస్)(సూర్యాపేట) : మండల పరిధిలోని ఏపూరి గ్రామంలో మంగళవారం జరిగిన వీరస్వామిని అదే గ్రామానికి చెందిన గుండ్లపల్లి నరసయ్య హత్య చేశాడని హతుడి భార్య సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు. వీరస్వామి తన భార్యతో సన్నిహితంగా మెలుగుతున్నాడనే అనుమానంతోనే నరసయ్య ఘాతుకానికి ఒడిగట్టాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు పరారీలో ఉన్నాడని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



యల్లమ్మ (ఫైల్)

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : గుండెపోటుతో ఉపాధి కూలీ మృతిచెందింది. ఈ ఘటన మండల పరిధిలోని ఏపూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రావుల యల్లమ్మ (48) రోజూ మాదిరిగానే ఉపాధి హామీ పనికి వెళ్లి అస్వస్థత గురైంది. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు చెప్పారని గ్రామస్తులు తెలిపారు. మృతురాలు యల్లమ్మకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ఆమె మృతదేహాన్ని ఏపీవో ఈశ్వర్ సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఏపూర్ గ్రామ సర్పంచ్ సానబోయిన రజిత సుధాకర్, ఉప సర్పంచ్ అవిరే పద్మ అప్పయ్య, వార్డు సభ్యులు కారింగుల లింగయ్య, శోభ ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం



ప్రమాదానికి కారణమైన ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు



రోడ్డుపై బోల్తాపడిన కట్టెల లోడు ట్రాక్టర్

- మరో ముగ్గురికి గాయాలు

చిట్యాల: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. చిట్యాల, నార్కట్‌పల్లి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. రామన్నపేట మండల కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన మచ్చ వెంకటేశం(42)చిట్యాల మండలం ఆరెగూడెం గ్రామం నుంచి బుధవారం తెల్లవారు జామున ట్రాక్టర్ ట్రాలీలో కట్టెల లోడుతో చౌటుప్పల్‌కు వెళ్తున్నాడు. చిట్యాల మండలంలోని వెలిమినేడు శివారులోకి వెళ్లగానే విజయవాడ వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు అతివేగంగా ట్రాక్టర్‌ను వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మచ్చ వెంకటేశం అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటేశం మృతదేహం కట్టెల లోడు కింద ఇరుక్కుపోయింది.



మచ్చ వెంకటేశం (ఫైల్)

పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీశారు. కాగా, బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని యువకుడు..



అశోక్‌కుమార్(ఫైల్)

నార్కట్‌పల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం ఏఎన్ కాలనీకి చెందిన దోన్న అశోక్‌కుమార్ (30) నల్లగొండలోని కేఎఫ్‌సీలో బ్రాంచ్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. పని నిమిత్తం మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ పని ముగిసిన తర్వాత బుధవారం బైక్‌పై నల్లగొండకు బయలుదేరాడు. మార్గమధ్యలో నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నల్లగొండ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అశోక్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదం అనంతరం లారీ ఆపకుండా వెళ్లడంతో పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా గుర్తించారు. లారీని, డ్రైవర్‌ను వాడపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలో పట్టుకుని నార్కట్‌పల్లి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

పోలీస్ అభ్యర్థుల ఈవెంట్స్ షురూ



అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు



లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థి

- తొలిరోజు 600 మందికి గాను 468 మంది హాజరు

నల్లగొండ క్రైం : పోలీస్ ఉద్యోగాల ఎంపికకు బుధవారం నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. మొదటి రోజు 600 మంది అభ్యర్థులకు గాను 468 మంది హాజరుకాగా 106 మంది ఎంపికయ్యారు. అభ్యర్థుల అన్ని సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈవెంట్స్‌ను ప్రత్యేక ఎస్పీ శబరీష్, నల్లగొండ ఎస్పీ అపూర్వరావు పర్యవేక్షించారు. ఎండ వేడిమికి అభ్యర్థులు ఇబ్బంది పడకుండా ఉదయం 10గంటల లోపు ఈవెంట్స్ పూర్తయ్యేలా అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

ఇద్దరికి గాయాలు

సూర్యాపేట క్రైం : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు అతిగా మద్యం సేవించి బైక్‌పై వేగంగా వచ్చి ఎన్టీఆర్ పార్కు సమీపంలో కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారి రాజును ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. అదే వేగంతో వెళ్లిన ప్రభుత్వ వైద్యుడు మరో ద్విచక్రవాహనదారుడిని ఢీకొట్టడంతో అతడి తలకు కూడా గాయాలయ్యాయి. అనంతరం ఆ ప్రభుత్వ వైద్యుడు గాయపడిన వారిని దూషిస్తూ వెళ్లిపోయాడని స్థానికులు తెలిపారు.

సంతానం కలగడం లేదని..

- పురుగుల మందు తాగిన కానిస్టేబుల్
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

చివ్వెంల(సూర్యాపేట) : సంతానం కలగడం లేదని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కానిస్టేబల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దొడ్డి మధుబాబు (39) చివ్వెంల మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఇతడికి 2012వ సంవత్సరంలో అవని కుమారితో వివాహం కాగా సంతానం కలగలేదు. ఈ నేపథ్యంలోనే మనస్తాపానికి గురైన మధుబాబు ఈనెల 7న సూర్యాపేటలో పురుగుల మందు కొనుగోలు చేసి తాగాడు. అనంతరం ఇంటికి చేరుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు అతడిని సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు మణికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు.



మధుబాబు (ఫైల్)

తాళం వేసిన ఇళ్లలో చోరీ

రామగిరి(నల్లగొండ) : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన తిప్పర్తి మండలంలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ సమీపంలోని హ్యాపీ హోమ్స్ నందు తాళం వేసి ఊరికి వెళ్లిన వారి ఇళ్లలోకి దొంగలు చొరబడ్డారు. కాలనీలో ప్లాట్ నంబర్ 34లో ఉంటున్న మాచర్ల శ్రావణ్ ప్రసాద్ 13 తేదీన సాయంత్రం హైదరాబాద్‌కు వెళ్లగా ఇంట్లో ఉంచిన 2.5 తులాల పుస్తెల తాడు, 8 గ్రాములు బంగారం, ల్యాప్‌టాప్, హెచ్‌పీ కలర్ ప్రింటర్‌ను చోరీ చేశారు. అదే విధంగా ప్లాట్ నంబర్ 212లో ఉంటున్న దర్నెబోయిన శారద 13 తేదీన ఉదయం నాగర్‌కర్నూల్‌లో ఉంటున్న భర్త వద్దకు వెళ్లింది. ఇంట్లో దాచుకున్న 5 గ్రాముల రెండు ఉంగరాలు, 20 తులాల వెండి పట్టా గొలుసులు ఎత్తుకెళ్లారు. అదే కాలనీలో ప్లాట్ నంబర్ 36లో ఉంటున్న బొబ్బ దినకర్‌రెడ్డి కుంటుంబ సభ్యులు 9న హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం ఉదయం ఇంటికి వచ్చే చూసే సరికి ఇంటి తాళం తీసి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా 2 గ్రాములు బంగారు ఉంగరం, 30 తులాల వెండి ఆభరణాలు, ల్యాప్‌టాప్‌తో పాటు రూ. 3 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వీరితో పాటు మరో నాలుగు ఇండ్లలో కూడా చోరీకి ప్రయత్నించారు. కానీ ఎలాంటి విలువైన వస్తువులు పోలేదు. మంగళవారం క్లూస్ టీమ్, ఫింగర్ ప్రింట్స్ బృందం వెళ్లి ఆధారాలు సేకరించారు. బాధితుడు బొబ్బల దినకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

దొండపాడులో..

హుజూర్‌నగర్ (చింతలపాలెం): పట్టపగలే దుండగులు తెగబడ్డారు. తాళం వేసిన ఇంట్లోకి చొరబడి బంగారు, వెండి వస్తువులను అపహరించుకుపోయారు. ఈ ఘటన మండలంలోని దొండపాడులో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పందిటి గోపయ్య స్థానిక తిరుపతమ్మ గుడి వద్ద ఉంటూ సిమెంట్ పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం నైట్ డ్యూటీ చేసివచ్చి ఇంటి వద్దనే ఉన్నాడు. భార్య నాగేంద్ర పొలం పనికి వెళ్లింది. 12 గంటల సమయంలో కొడుకును తీసుకువచ్చేందుకు పాఠశాల వద్దకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి బీరువాలోని నాలుగు బంగారపు ఉంగరాలు, దిద్దులు, వెండి పట్టీలను దొంగిలించుకెళ్లారు. అనంతరం బాధితుడు గోపయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డిండి సీఐని సస్పెండ్ చేయాలని ధర్నా



దేవరకొండ డీఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దేవరకొండ: భూ సంబంధిత విషయంలో జోక్యం చేసుకొని మహిళపై దురుసుగా ప్రవర్తించిన డిండి సీఐ పరశురాంను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం దేవరకొండ డీఎస్పీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండలం ఎర్రారం గ్రామానికి చెందిన మావిళ్ల మల్లయ్య, మావిళ్ల చిన్న జంగయ్య మధ్య కొంత కాలంగా భూమి పంచాయితీ నడుస్తుంది. ఇదిలా ఉంటే సీఐ పరశురాం బుధవారం దేవరకొండలోని సర్కిల్ కార్యాలయానికి మల్లయ్య కుటుంబ సభ్యులను పిలిపించి దురుసుగా ప్రవర్తించాడని, అక్కడే ఉన్న మల్లయ్య బంధువైన వరమ్మపై చేయి చేసుకున్నాడని వారు ఆరోపించారు. విషయం తెలుసుకున్న దేవరకొండ మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి డీఎస్పీ కార్యాలయానికి చేరుకొని ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా బాలూనాయక్ మాట్లాడుతూ.. సీఐపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ నాగేశ్వర్ రావు కాంగ్రెస్ నాయకులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ధర్నా విరమించలేదు. బాలూనాయక్ జిల్లా ఎస్పీ అపూర్వరావుతో ఫోన్‌లో మాట్లాడి సీఐపై చర్యలు తీసుకోవాలని కోరగా, ఆమె విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ధర్నాలో నాయకులు దూదిపాళ్ల వేణుధర్‌రెడ్డి, నేనావత్ కిషన్‌నాయక్, బీల్యానాయక్, సిరాజ్ ఖాన్, రవినాయక్, రేఖశ్రీధర్‌రెడ్డి, మాధవరెడ్డి, రుక్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వ్యాపారిపై కేసు

మద్దిరాల : నాసిరకం కలుపు మందు అమ్మి రైతును మోసం చేశాడనే అభియోగం మేరకు బుధవారం ఎరువుల వ్యాపారిపై కేసు నమోదైంది. బాధిత రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన జంబారపు అశోక్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన వేరుశనగ చేనులో కలుపు నివారణకు గత డిసెంబర్‌లో మండల కేంద్రంలోని అన్నదాత ఎరువుల దుకాణంలో ఓ కంపెనీకి చెందిన కలుపు మందు కొనుగోలు చేశాడు. దానిని పిచికారీ చేసినా ఎలాంటి ఫలితం లేదు. దుకాణం యజమానిని సంప్రదిస్తే నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. దీంతో సదరు రైతు డీసీఐసీ కన్వీనర్ చింతమళ్ల గురువయ్యకు ఫిర్యాదు చేశాడు. అయినా దుకాణం యజమాని పట్టించుకోకపోవడంతో వినియోగదారుల ఫోరంలో పిటిషన్ దాఖలు చేశాడు. కోర్టు ఆదేశాల మేరకు ఎరువుల వ్యాపారిపై కేసు నమోదైనట్లు బాధిత రైతు తెలిపాడు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

పెన్‌పహాడ్ : గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా లయోలా కళాశాలకు చెందిన బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ కోర్సు విద్యార్థులు పంటల సాగుపై అవగాహన కల్పించారు. బుధవారం మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డి. నరేష్, ఎ. కిరణ్, నరేష్, ఆదర్శ్, రైతులు మాధవరావు, జానకిరామయ్య, లింంగయ్య, సైదులు, వెంకులు, జోషి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



తలపడుతున్న ఉత్తరాఖండ్, కేరళ జట్లు

పెద్దవూర: దున్న ఇద్దాస్ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా మండలంలోని చింతపల్లిలో నిర్వహిస్తున్న కబడ్డీపోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. బుధవారం సాయంత్రం ఫ్లడ్‌లైట్ల వెలుగులో ఉత్తరాఖండ్ కేరళ జట్లు తలపడ్డాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు మొదట 16 రాష్ట్రాల (మహిళ)జట్లు రాగా బుధవారం మరో నాలుగు జట్లు వచ్చి చేరాయి. 20రాష్ట్రాల జట్లు ఈ ఆటలో పాల్గొంటుండగా చింతపల్లిలో పండుగ వాతావరణం నెలకొన్నది. సాయంత్రానికి చింతపల్లి గ్రామ ప్రజలే కాకుండా చుట్టుపట్టు గ్రామాల ప్రజలు ఆసక్తిగా పోటీలను చూసేందుకు వచ్చారు. తెలంగాణ, కేరళ, సౌత్‌సెంట్రల్ రైల్వే హైదరాబాద్, వెస్ట్‌బెంగాల్, పంజాబ్, ఢిల్లీ, హరియాణా, కర్ణాటక, జార్ఖండ్, జమ్ము కశ్మీర్, ఉత్తరాఖండ్, ఆంధ్రమిషన్, కేరళ-2 తదితర రాష్ట్రాల జట్లు పాల్గొంటున్నట్లు టోర్నమెంట్ కమిటీ చైర్మన్ ఎస్‌కె.అబ్బాస్, కన్వీనర్‌కర్తయ్య, కోకన్వీనర్ భూలోకరావు తెలిపారు.

గీత కార్మికుడు మృతి

శాలిగౌరారం: తాటిచెట్టు పైనుంచి పడి ఓ గీతకార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని ఊట్కూరు గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఊట్కూరు గ్రామానికి చెందిన బొమ్మగాని లింగయ్య(62) రోజువారీ మాదిరిగానే కల్లుగీసేందుకని సాయంత్రం గ్రామ సమీపంలోని తాటిచెట్లను ఎక్కేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఓ తాటిచెట్టును ఎక్కిన లింగయ్య ప్రమాదవశాత్తు జారి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వచ్చి చూసే సరికి అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య, వివాహితురాలైన కుమార్తె ఉన్నారు.

తల్లిదండ్రులు మందలించారని..

- గడ్డిమందు తాగిన బాలిక
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

ఆత్మకూరు(ఎం): తల్లిదండ్రులు మందలించారని మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు(ఎం) మండలంలోని కొరటికల్ గ్రామానికి చుఎందిన వనమాల కృష్ణ, వాణి దంపతుల కుమార్తె అశ్విత (17) భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటోంది. ఈ నెల 2వ తేదీన ఇంటికి వచ్చి ఉంటోంది. హాస్టల్‌కు వెళ్లాలని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైంది. ఈ నేపథ్యంలో అదే రోజు ఇంటి వద్దనే గడ్డిమందు తాగింది. అపస్మారకస్థితిలో పడి ఉన్న అశ్వితను గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న అశ్విత మంగళవారం రాత్రి మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధు తెలిపారు.

ముగ్గురు బైక్ దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్‌కుమార్



స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న సీఐ

- ఐదు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్ స్వాధీనం

మిర్యాలగూడ అర్బన్: జల్సాలకు అలవాటు పడి బైక్‌లను అపహరిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టూటౌన్ సీఐ నిగిడాల సురేష్ కుమార్ నిందితుల వివరాలు వెల్ల డించారు. మిర్యాలగూడ మండలం దుర్గానగర్‌కు చెందిన అవిరెండ్ల శశి ప్రీతం, పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన పాతులోతు గౌతమ్, బాపూజీనగర్‌కు చెందిన సకినాల మనిదీప్ స్నేహితులు. వీరు చెడు వ్యసనాల బారిన పడి అవసరాలను తీర్చుకునేందుకు బైక్‌లను అపహరిస్తున్నారు. వీరు దామరచర్ల, మిర్యాలగూడ పట్టణాల్లో పార్కింగ్ చేసిన బైక్‌లను గుర్తించి చోరీ చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా పల్సర్ బైక్‌పై ముగ్గురు వ్యక్తులు తారసపడ్డారు. వారిని ఆపాలని కోరగా పారిపోయేందు కు ప్రయత్నించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా పొంతన లేని సమాధానాలు చెప్పారు. దీంతో వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా బైక్‌లను అపహరిస్తున్నట్లు ఒప్పుకున్నారు. ఆరు నెలలుగా ఐదు బైక్‌లను చోరీ చేసినట్లు నేరం అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.1.85లక్షల విలువైన బైక్‌లతో పా టు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కాగా, వీరి లో అవిరెండ్ల శశి ప్రీతం హైదరాబాద్‌లోని నాచారం, కుషాయిగూడ పరిధిలో బైక్ దొంగతనా ల కేసుల్లో జైలుకు సైతం వెళ్లి వచ్చినట్లు సీఐ తెలి పారు. కేసు ఛేదించిన పోలీస్ సిబ్బందిని డీఎస్పీ వెంకటగిరి అభినందించారు. సమావేశంలో ఎస్ఐలు కృష్ణ య్య, సైదిరెడ్డి, వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.